క్లుప్తంగా

రోహిత్‌రెడ్డితోనే అభివృద్ధి

తాండూరు రూరల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితోనే తాండూరు నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందని గౌతపూర్ సర్పంచ్ రాజప్పగౌడ్, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండల పరిధి గౌతపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి, ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటువేసి రోహిత్‌రెడ్డి గెలిపించాలని కోరారు.

మార్కెట్ యార్డుకు వరుస సెలవులు

పరిగి: శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పరిగి మార్కెట్ యార్డుకు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 7వరకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ యార్డులో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కావున రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని కోరారు. యథావిధిగా డిసెంబర్ 8 నుంచి మార్కెట్ పనిచేస్తుందని వెల్లడించారు.

ఘనంగా కౌశిక ద్వాదశి


ఆస్థానం నిర్వహిస్తున్న బ్రాహ్మణులు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కౌశిక ద్వాదశి విశేష పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతం అనంతరం ఉగ్ర శ్రీనివాసమూర్తి వారి వీధి ఉత్సవం నిర్వహించారు. ఏడాదికి ఒకరోజు మాత్రమే స్వామివారు బయటకు వస్తారని ఆలయ అర్చకులు తెలిపారు. తిరుచ్చి వీధి ఉత్సవం తరువాత కౌశిక పురాణం విశిష్టతను భక్తులకు వివరించారు.

పౌష్టికాహారం.. తల్లీబిడ్డకు ఆరోగ్యకరం


గర్భిణులకు కిట్లు అందజేస్తున్న వైద్యులు

కుల్కచర్ల: పౌష్టికాహారం తీసుకోవడం వలన గర్భిణులకు సుఖ ప్రసవం అవటమే కాకుండా.. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని మండల వైద్యాధికారి మాధురి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్‌లు చాలా ఉపయోగ పడతాయని చెప్పారు. కిట్‌లోని పోషకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు ప్రశాంతి, వైద్యసిబ్బంది శివాని, యాదమ్మ, విజయలక్ష్మి, సుజాత, రత్నమ్మ, గౌరి, మైబమ్మ, జంగమ్మ, భారతమ్మ, జ్యోతి, శ్రీలత, వెంకటయ్య, ప్రశాంత్, శ్రీనివాస్, శిరాజ్, లింగమ్మ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సాక్షిని అభినందిస్తున్న పాఠశాల బృందం

తాండూరు రూరల్: జినుగుర్తి గిరిజన బాలిక సంక్షేమ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థిని సాక్షి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 16న కిసరగుట్టలో జరిగిన అండర్–17 విభాగంలో సాక్షి సత్తా చాటిందని, డిసెంబర్‌లో హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆమె ఎంపికయినట్లు శుక్రవారం ప్రిన్సిపాల్ పార్వతమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సాక్షిని పాఠశాల బృందం అభినందించింది.

నేడు జనసేన బహిరంగ సభ

పాల్గొననున్న పవన్‌కళ్యాణ్

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం తాండూరులో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, అసెంబ్లీ అభ్యర్థి నేమూరి శంకర్‌గౌడ్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు జయశ్రీలతో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీ మద్దతుతో బరిలో ఉన్నానని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తనకు పూర్తి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ప్రచారంలో భాగంగా నేడు తాండూరులో జరపనున్న సభకు పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ రానున్నారని, అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

కుటుంబ పాలనకు చరమగీతం


ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కూతురు అనన్య, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి

- కాంగ్రెస్‌ను గెలిపించి.. సోనియాకు కానుకగా ఇవ్వాలి
- ఇందిరమ్మ రాజ్యం వస్తే అందరికీ మేలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు
- హస్తానికే తమ మద్దతు: మైనార్టీలు

మర్పల్లి: కల్వకుంట్ల కుటుంబ పాలనకు చరమగీతం పాడి, తెలంగాణ ఇచ్చిన సోనియాకు.. కాంగ్రెస్‌ను గెలిపించి రాష్ట్రాన్ని కానుకగా ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మర్పల్లి మండలం పట్లూర్‌లో కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ తనయ అనన్య పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'సుదీర్ఘ తెలంగాణ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగం చేశారు. ఇది చూసి చలించిన సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చి, తెలంగాణ ప్రజల కలను సాకారం చేసింది. కానీ తెలంగాణను పదేళ్లుగా పాలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు. స్వరాష్ట్రంలో బతుకులు మారుతాయనుకున్న యువతను మోసం చేశారు' అని అధికార పార్టీపై తీవ్రంగా మండిపడ్డారు. కాంగ్రెస్ వస్తే.. ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, తద్వారా అందరికీ మేలు జరుగుతుందని చెప్పారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టో అమలు అవుతాయని తెలిపారు. కావున ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి, ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, సీనియర్ నాయకులు సుభాష్‌యాదవ్, ఎంపీటీసీలు స్వప్న, మంజుల, పట్లూర్ మాజీ సర్పంచ్ సురేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు రఫీ, లక్ష్మారెడ్డి, రాచన్న, ఉపాధ్యక్షుడు గోపాల్, సీనియర్ నాయకులు సుభాష్‌యాదవ్, రాఖేష్, రాజు, పాండునాయక్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను విస్మరించిన సీఎం

మర్పల్లి: మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన కాంగ్రెస్ పార్టీకి ముస్లిం వర్గం పూర్తి మద్దతుగా నిలుస్తుందని ఆ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహ్మద్ నసీరొద్దీన్ అన్నారు. వికారాబాద్ పట్టణంలో గొల్కొండ నవాబ్ మైబూబ్ అలాం ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీల సదస్సుకు ముస్లింలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. సీఎం కేసీఆర్ ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ వచ్చి పదేళ్లు కావస్తున్నా.. నేటి వరకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి.. విస్మరించారని మండిపడ్డారు. మైనార్టీల సంక్షేమం కోరే కాంగ్రెస్‌కు తమ సామాజిక వర్గం మొత్తం చేతి గుర్తుకు ఓటువేసి అధికారం చేపట్టేలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు సలీం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీ, ఎంఏ జబ్బార్, ఖయూం, ఫైల్మాన్ ఖాసిం, సత్తార్, లాయకల్లీ, జాఫర్, ఖాదర్, జాకీర్, కటిక కలీం, జాకీర్ పాల్గొన్నారు.

హస్తం గూటికి పీఏసీఎస్ చైర్మన్

అనంతగిరి: వికారాబాద్ మండలం కొత్తగడి పీఏసీఎస్ చైర్మన్ సుభాన్‌రెడ్డి మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.


సుభాన్‌రెడ్డికి కండువా కప్పుతున్న ప్రసాద్‌కుమార్


మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కాంగ్రెస్‌తోనే ముదిరాజ్‌లు

- మమ్మల్ని కేసీఆర్ అవమానించారు
- జాతీయ పార్టీకే మద్దతివ్వండి
- సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపు

వికారాబాద్ అర్బన్: ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారంతా కాంగ్రెస్‌తోనే ఉన్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిముకుల శ్రీనివాస్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన వికారాబాద్‌లో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో సుమా రు 65 లక్షల మంది ముదిరాజులు ఉన్నారని, ఇంతటి జనాభా కలిగిన సామాజిక వర్గానికి బీఆర్‌ఎస్ పార్టీ ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వకుండా అవమానించిందని ఆరోపించారు. అంతే కాకుండా సీఎం కేసీఆర్ అనేక సార్లు తన ప్రసంగాల్లో ముదిరాజ్‌లను అవమానించారని తెలిపారు. అలాంటి వ్యక్తికి చెందిన పార్టీకి ముదిరాజ్‌లు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి మార్చాలని దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నా.. ముఖ్యమంత్రి పట్టించుకోలేదని విమర్శించారు. బీసీ బంధు పథకంలో ముదిరాజ్‌లకు చోటు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో మేలు జరుగుతుందనే నమ్మకంతో.. ముదిరాజ్‌లంతా ఆ పార్టీకి మద్దతుగా నిలవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తామని పొందుపరిచారని, అందుకే మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో సంఘం సీనియర్ నాయకు లు నరసింహులు, గుడిసె లక్ష్మణ్, మర్పల్లి సాయన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్‌బీఎల్‌లో ఐటీ దాడులు

యాలాల: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పరిశ్రమలపై ఐటీశాఖ దాడులు ముమ్మరం చేసింది. పలువురు రాజకీయ నేతలు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు చెందిన సంస్థలపై వరుస సోదాలు చేస్తూ కలకలం రేపుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం యాలాల మండలం జక్కేపల్లి సమీపాన ఉన్న ఆర్‌బీఎల్(రాడికల్ బయో ఆర్గానిక్స్ లిమిటెడ్) కంపెనీకి చెందిన నగరంలోని ప్రధాన కార్యాలయంలో ఐటీ సోదాలు జరిగాయి. ఈ సంస్థకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న బుయ్యని మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి ఎండీగా ఉండటం గమనార్హం. ఈ దాడుల్లో కంపెనీ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు సమాచారం. కాగా నగరంలోని కొండాపూర్‌లో ఇదే సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంలో సోదా చేసినట్లు తెలిసింది. ఆర్‌బీఎల్‌లో ఐటీ సోదాల విషయం తెలిసిన మీడియా ప్రతినిధులు కంపెనీ వద్దకు వెళ్లగా.. వారిని సెక్యూరిటీ అడ్డగించి, ప్రధాన గేటు మూసివేశారు.

మోదీ హయాంలో దేశం పురోగతి

- అవినీతిరహిత పాలనే బీజేపీ లక్ష్యం
- ఇంటింటి ప్రచారంలో కమలనాథులు


మాట్లాడుతున్న ఇరు పార్టీల నాయకులు

యాలాల: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలోనే దేశం పురోగతి సాధించిందని, అవినీతిరహిత పాలనే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యాలాల మండలం బెన్నూరు, యాలాల, విశ్వనాథ్‌పూర్, కమాల్‌పూర్, ముద్దాయిపేట, జక్కేపల్లి, సంగెంకుర్దు, పగిడియాల గ్రామాల్లో బీజేపీ బలపరచిన జనసేన తాండూరు అసెంబ్లీ అభ్యర్థి శంకర్‌గౌడ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాయమాటలతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు ఒకటేనన్నారు. ఓట్ల కోసం ఎవరు డబ్బులిచ్చినా తీసుకోవాలని, ఆ డబ్బు మనదేనని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం పట్టని అధికార పార్టీని, దశాబ్దాలుగా దేశాన్ని పాలించి, రాష్ట్రానికి ఏమీ చేయని కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, కావున గాజు గుర్తుకు ఓటేసి, బీజేపీ మద్దతు తెలిపిన జనసేన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రజినీకాంత్, నాయకులు పటేల్ జయశ్రీ, మండల ప్రధాన కార్యదర్శులు వెంకటేషం, శంకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి జంగం యాదగిరి, అరుణ్‌కుమార్, హన్మంతు తదితరులు ఉన్నారు.

పక్కాగా గ్యారంటీలు

తాండూరు రూరల్: చేతి గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి ఓగిపూర్, చిట్టిఘనాపూర్, గౌతపూర్, చింతమణిపట్నం, పర్వాతపూర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు చిట్టిఘనాపూర్ వెంకటయ్య ఉన్నారు.

మాతోనే ప్రజా సంక్షేమం


మైనార్టీలతో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని, వాటిని ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని ఆ పార్టీ సీనియర్ నేత రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. ఇందిరాగాంధీ హయాంలో దేశం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో వైఎస్‌ఆర్ నేతృత్వంలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. మరో సారి కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఆరు గ్యారంటీ స్కీంలు అమలు జరిగి అందరికీ మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కావున చేతి గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు, కార్యకర్తలు నాగయ్య, మైనొద్దీన్, చందు, హఫీజ్ ఉన్నారు.

పింఛన్ కోసం పండుటాకుల పడిగాపులు


జీపీ కార్యాలయం వద్ద లబ్ధిదారులు


దౌల్తాబాద్: ప్రభుత్వం పంపిణీ చేసే ఆసరా పింఛన్ కోసం వృద్ధులు, వికలాంగులకు పడిగాపులు తప్పడం లేదు. దౌల్తాబాద్ మండలం గోకఫసల్‌వాద్ గ్రామంలో పింఛన్ పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానుకూలంగా తపాలా అధికారి (బ్రాంచి పోస్ట్ మాస్టర్) పింఛన్ ఇవ్వడం లేదని ఆరోపించారు. గురువారం కొంతమందికి గ్రామ చివరన ఉన్న ఓ రైతు పొలంలో పంపిణీ చేశారని, శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్దకు రమ్మన్నారని చెప్పారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉన్నామని, అయినా పోస్ట్ మాస్టర్ రాలేదని వాపోయారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఆసరాను సకాలంలో ఇచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ధారూరులో పులి కలకలం

భయాందోళనకు గురవుతున్న జనం

ధారూరు: ప్రవహిస్తున్న వాగులోకి, పంట పొలంలోకి వచ్చిన చిరుతపులిని పంటపొలానికి కాపలాగా ఉన్న దంపతులు శివప్ప, లక్ష్మిలు చూసి భయంతో పరుగులు తీశారు. పులిపులి అన్న వారి అరుపులకు పరిసర ప్రాంతంలో పనిచేస్తున్న రైతులు భయాందోళనకు గురయ్యారు. ఈ సంఘటన ధారూరు మండల కేంద్రం సమీపాన కల్వ జ్ఞానేశ్వర్ వ్యవసాయ పొలం వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న డీఎఫ్‌ఆర్‌ఓ జగన్‌మోహన్, సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. పులి ఆనవాళ్ల కోసం అన్వేశించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనంతరం ఆయన మాట్లాడారు. కంది పొలాలు ఏపుగా పెరిగి, పులికి ఆవాసంగా మారాయని అభిప్రాయపడ్డారు. చిరుత సంచారంతో భయపడిన కొందరు రైతులు బాణాసంచాలు కాల్చారని, దీంతో అది దట్టంగా ఉన్న రాంపూర్‌తండా సమీప అడవిలోకి పారిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. 2012 డిసెంబర్ 4న అడవిలోకి రెండు చిరుతలు వచ్చాయని, ఒక చిరుత వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకోవడంతో.. దానిని అటవీ అధికారులు కాపాడి, నగరంలోని జూపార్క్‌కు తరలించారని పేర్కొన్నారు. మిగిలిన మరో చిరుతే ఇప్పుడు ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధి అడవిలో తిరుగుతుండవచ్చన్నారు. పులి రాంపూర్‌తండా అడవిలోకి వెళ్లి ఉండవచ్చని, రైతులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. నిర్భయంగా పశువులను మేపుకోవచ్చని, పొలం పనులు చేసుకోండని సూచించారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న గురునాథ్‌రెడ్డి


ముస్లింలతో మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

రేవంత్‌ను గెలిపించండి..

కొడంగల్: అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కర్నాటక ఎమ్మెల్యే ప్రసాద్, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు కొడంగల్ పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటు వేసి రేవంత్‌ను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. సందారం ప్రశాంత్, కృష్ణంరాజు, దాము, నయీమ్, మురహరి వశిష్ట ఉన్నారు.

దోపిడీ పాలనను అంతమొందించాలి


ప్రచారం చేస్తున్న సీపీఐ, వైఎస్‌ఆర్‌టీపీ నేతలు

దోమ: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనతో ప్రజలు విసుగు చెందారని సీపీఐ, వైఎస్‌ఆర్‌టీపీ నేతలు మహ్మద్, కోళ్ల యాదయ్య అన్నారు. శుక్రవారం దోమ మండలం కిష్టాపూర్, బుద్లాపూర్‌తండా, దిర్సంపల్లి గ్రామాల్లో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ దోపిడీ పాలనను ప్రజలు అంతమొందించాలని పిలుపునిచ్చారు. అమలుకు నోచుకోని పథకాలను తీసుకువచ్చి, అధికార పార్టీ నేతలకే లబ్ధి చేకూర్చిందని ఆరోపించారు. కాంగ్రెస్‌తోనే మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేసి ఎమ్మెల్యే అభ్యర్థి టి. రామ్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. నేతలు వెంకటేశ్, చంద్రయ్య, రాములు, జంగయ్య ఉన్నారు.

హస్తంతోనే జీవితాల్లో వెలుగు

కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ వస్తేనే నిరుపేదల జీవితాల్లో వెలుగు వస్తుందని కాంగ్రెస్ పార్టీ పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి కూమార్తె మేఘనారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుల్కచర్ల మండలం తిర్మలాపూర్, తుపాకుల తండా, చాపలగూడెం గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ మేలన్నారు. చేతి గుర్తుకు ఓటువేసి టీఆర్‌ఆర్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు ఉన్నారు.

'దళితబంధు'వుల ఆనందం


ధారూరు: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులు

సీఎం ప్రకటనతో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

మోమిన్‌పేట: ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపిస్తే.. వికారాబాద్‌లో ఒకే విడతలో మొత్తం దళితులందరికీ దళిత బంధు పథకం అమలుచేస్తామని సీఎం చెప్పడంతో దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అధ్యక్షుడు వెంకట్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రం పార్టీ కార్యాలయ ఆవరణలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడారు. దళిత సమాజం కోసం కృషి చేస్తున్నది ఒక్క బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. ఒక కుటుంబానికి రూ.10 లక్షలు పథకం కింద ఇస్తే.. వారికి ఉపాధి దొరకడమే కాకుండా.. ఎవరిపై ఆధార పడకుండా గర్వంగా జీవిస్తారని పేర్కొన్నారు. దళితుల అభ్యున్నతికి పాటుపడుతున్న బీఆర్‌ఎస్‌కే ప్రతి ఒక్కరు ఓటు వేయాలని ఆయన కోరారు.

దళిత కుటుంబాలు బాగుపడ్డట్లే

ధారూరు: గురువారం వికారాబాద్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే ఆనంద్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనకు దళిత సమాజం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం నాగారం గ్రామంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, దళితులు సమష్టిగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. సీఎం హామీ ఇచ్చారంటే దళిత కుటుంబాలు బాగుపడినట్లేనన్నారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు వినోద్, పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తమ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మోమిన్‌పేట: కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గులాబీ శ్రేణులు

బంట్వారంలో..

ఆనంద్‌ను మరోసారి గెలిపిస్తే వికారాబాద్ నియోజకవర్గం దళితులకు దళితబంధు ఇస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి రాంపూర్‌లో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. రైతుబంధు మండల అధ్యక్షుడు సత్యం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మహబూబ్, నాయకులు మాణిక్యం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

- మూడోసారి కేసీఆర్ విజయం తథ్యం
- ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

మర్పల్లి: సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని బీఆర్‌ఎస్ వికారాబాద్ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మర్పల్లి మండలం పంచలింగాల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సార్వత్రిక సమరంలో ముఖ్యమంత్రి హాట్రిక్ ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. అంతే కాకుండా మరోసారి నన్ను గెలిపిస్తే వికారాబాద్‌లోని దళితులందరికీ దళితబంధు పథకం రూ.10 లక్షలు ఇస్తానని సీఎం చెప్పారని ఆనంద్ వెల్లడించారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా.. దళితబంధు అందాలన్నా ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీకోసం పనిచేసే కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మధుకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ గుప్తా, ఎంపీపీ లలిత రమేష్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అశోక్, రమేష్‌మిత్ర, ప్రధాన కార్యదర్శి రాచన్న, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, మార్కెట్ డైరెక్టర్ గౌస్, మర్పల్లి టౌన్ ప్రసిడెంట్ గఫార్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తాండూరు రూరల్: తాండూరు మండలం సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక నుంచి మద్యం సరఫరా అవుతుందన్న సమాచారంతో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం సోదాలు నిర్వహిస్తున్న క్రమంలో కర్ణాటకలోని చత్రసాల నుంచి ఓగిపూర్‌కు ద్విచక్రవాహనంపై కాటన్లు తరలిస్తున్న వ్యక్తి భయపడి వాహనాన్ని వదిలి పారిపోయాడు. ఎక్సైజ్ పోలీసులు కాటన్లను పరిశీలించగా మద్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్నామని, వాహనదారుడి ఆచూకీ లభ్యం కాలేదని ఎక్సైజ్ సీఐ అనంతయ్య తెలిపారు.


మద్యం స్వాధీనం చేసుకున్న పోలీసులు